క్లుప్తంగా

వైభవంగా రామాలయ వార్షికోత్సవం

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామంలోని కోదండ రామాలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా కోదండ రామునికి క్షీరాభిషేకం చేశారు. చామంతి పూలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వాడపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకున్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పారిశుధ్యంపై దృష్టి



ఈదరాడలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి రాజు

మామిడికుదురు: సంపూర్ణ పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు సూచించారు. ఈదరాడలో గురువారం ఉపాధి హామీ కూలీలకు స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పంచాయతీ సూచించిన చోటే వేసేలా ప్రజల్ని చైతన్యవంతులను చేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా వేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో దీని పట్ల పూర్తి అవగాహన వచ్చిన రోజునే పారిశుధ్యం సమస్యను పరిష్కరించవచ్చన్నారు.

రుణాల మంజూరుకు చర్యలు

అంబాజీపేట: టార్గెట్లను అనుసరించి ఆయా బ్యాంకుల వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం లబ్ధిదారులకు లోన్స్ మంజూరు అవుతాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలో బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎంపీడీఓ జి.వి.సరోవర్ అధ్యక్షతన ఇంటర్వ్యూలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 1,397 మంది దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అంబాజీపేట యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్, పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంక్, ముక్కామల స్టేట్ బ్యాంక్, నేదునూరు ఇండియన్ బ్యాంక్ మేనేజర్లు లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి ఇంటర్వ్యూలు చేశారు.

గోదావరి ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రసాద్

మలికిపురం: గోదావరి ఒలింపియాడ్‌లో రాష్ట్ర స్థాయిలో విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. గత డిసెంబర్‌లో జరిగిన గోదావరి ఒలింపియాడ్‌లో తొమ్మిది, పది తరగతి విద్యార్థులు తాడి ప్రిన్స్, నల్లి దీక్షిత గోదావరి తెలుగు, హిందీ ఒలింపియాడ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఇరువురిని పాఠశాల కరెస్పాండెంట్ పి.వి.వి.వరప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, ఫణిలక్ష్మి, పద్మజ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వంట షెడ్డుకు భూమి పూజ



అంబాజీపేట హైస్కూల్‌లో భూమి పూజ చేస్తున్న పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 1969 పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు కృతజ్ఞతా పూర్వకంగా వంట షెడ్డును నిర్మించేందుకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కొర్లపాటి రాజోపాలరావు, కొర్లపాటి వెంకటేశ్వరరావు, అరిగెల బలరామమూర్తి, విజ్జపు వెంకటరాజు, నేలపూడి నాగభూషణం, కాగితాపల్లి చంద్రరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రావులపాలెం ఆర్టీసీ డిపో పరిశీలన

రావులపాలెం: స్థానిక ఆర్టీసీ డిపోను గురువారం విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం ఇన్స్పెక్షన్ నిమిత్తం సందర్శించినట్టు డిపో మేనేజర్ జీజీవీ రమణ తెలిపారు. తొలుత గ్యారేజ్ సెక్షన్‌లో మొక్కను నాటి గ్యారేజీలో అన్ని సెక్షన్లను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం బస్టాండ్ కార్గోను సందర్శించి దాని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛభారత్‌లో భాగంగా బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీపీటీఓ ఎం.శ్రీనివాసరావు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

మోగుతున్న నీటి గంట

- పాఠశాలల్లో విద్యార్థులు నీరు తాగేందుకు ప్రత్యేక ఏర్పాటు
- రోజుకు మూడు సార్లు వాటర్ బెల్
- పిల్లలు డీహైడ్రేషన్‌కు గురవ్వకుండా చర్యలు



అంబాజీపేట హైస్కూల్‌లో వాటర్ తాగుతున్న విద్యార్థులు

అంబాజీపేట: ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే వేసవి ఆరంభంలోనే ఎండలు భగ్గుమంటున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఉక్కపోత ప్రారంభమవుతుంది. మధ్యాహ్న సమయానికి ఎండ తీవ్రత తారాస్థాయికి చేరుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అధిక ఉష్ణోగ్రతల కారణంగా శరీరంలో నీటి శాతం తగ్గిపోయి డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ సమస్యను అధిగమించడానికి విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మూడుసార్లు వాటర్ బెల్ కొట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలులోకి తెచ్చారు. ఎక్కడా నిర్లక్ష్యం చూపకుండా తప్పనిసరిగా నీటి గంట ఆదేశాల అమలు చేయాలని విద్యాశాఖ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ఉదయం 10, 11, 12 గంటలకు నీటి గంట కొట్టి విద్యార్థులు మంచినీరు తాగేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులందరికీ సురక్షిత నీరు అందుబాటులో ఉంచాలని, వాటర్ ప్లాంట్లు పనిచేయకపోతే తక్షణం మరమ్మతులు చేయించాలని, వాటర్ ప్లాంట్ల నుంచి సురక్షిత మంచినీటిని డబ్బాల్లో అందుబాటులో ఉంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించింది. ప్రస్తుతం ఒంటిపూట బడులు నడుస్తున్నాయి. ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. 8 గంటల నుంచి ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతూ మధ్యాహ్నానికి తారాస్థాయికి చేరుతుంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో వాటర్ బెల్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించింది. పి.గన్నవరం నియోజకవర్గంలో 290 స్కూళ్లలో 17,677, రాజోలు నియోజకవర్గంలో 229 స్కూళ్లలో 12,429, కొత్తపేట నియోజకవర్గంలో 238 స్కూళ్లకు 16,975 విద్యార్థులు ఉన్నారు.

అందుబాటులో సురక్షిత నీరు

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మనబడి నాడు–నేడు కార్యక్రమం అమలు చేసింది. పాఠశాలల్లో అత్యాధునిక సదుపాయాలతో పాటు విద్యార్థులు సురక్షిత మంచినీరు తాగేలా నీటి శుద్ధి యంత్రాలను సరఫరా చేసింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆర్వో ప్లాంటులను మంజూరు చేసింది. 50 శాతం పాఠశాలల్లో ప్రభుత్వం మరికొన్ని పాఠశాలలో దాతల సహకారంతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అందించిన ఆర్వో ప్లాంట్లలో కొన్ని మరమ్మతులకు గురికావడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. కొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో రోజుకు 10 నుంచి 15 వరకు వాటర్ టిన్నులు అందజేస్తున్నారు. ఇలాంటి అవకాశం లేని చోట్ల ఆయా పాఠశాలల హెచ్‌ఎంలే వాటర్ టిన్నులు ఏర్పాటు చేసుకుంటున్నారు.

తక్షణ మరమ్మతులకు ఆదేశం



ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మూడుసార్లు వాటర్ బెల్ విధానం పటిష్టంగా అమలు చేస్తున్నాం. ఉదయం 10, 11, 12 గంటలకు తప్పనిసరిగా వాటర్ బెల్ కొట్టి విద్యార్థులందరూ మంచినీరు తాగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. వాటర్ ప్లాంట్లు పనిచేయకపోతే తక్షణం మరమ్మతులు చేయించాలని ఆదేశించాం.

– కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓ, అంబాజీపేట

జగన్‌ను కలిసిన పార్టీ శ్రేణులు



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన గొల్లపల్లి సూర్యారావు, ఎంపీపీ మల్లిబాబు



జగన్‌ను కలిసిన వైస్ ఎంపీపీ–1 శుభాకర్



జగన్‌ను కలిసిన వైస్ ఎంపీపీ–2 ఆంజనేయులు

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని ఆ పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు కలిశారు. ఆ వివరాలను గురువారం వారు వెల్లడించారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్‌ను కలిసిన వారిలో ఎంపీపీ వీరా మల్లిబాబు, కో ఆప్షన్ మెంబర్ బళ్ళ నోబుల్ ప్రభాకర్, వైస్ ఎంపీపీ–1 కొల్లాబత్తుల శుభాకర్, వైస్ ఎంపీపీ–2 గుబ్బల ఆంజనేయులు, ఎంపీటీసీలు రుద్రరాజు చిన రాజా, నల్లి రత్నకుమార్, యెనుముల కొండమ్మ, మందపాటి రత్నం, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, నాయకులు రాపాక సూరయ్య, మందపాటి సత్యనారాయణ, యెనుముల ఆనంద్ కుమార్, దొండపాటి శ్రీనివాసరావు ఉన్నారు.

మద్యం షాపును తొలగించాలి



మాచవరంలో మద్యం షాపు పెట్టొద్దంటూ నిరసన తెలుపుతున్న మహిళలు

అంబాజీపేట: దళిత వాడల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని మాచవరం శివారు వేంకటేశ్వరకాలనీ, కుసుమవారిపేట, చిన్న కుసుమవారిపేట మహిళలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. మాచవరం పీచు ఫ్యాక్టరీ వద్ద మద్యం షాపును ఏర్పాటు చేయడం తగదని తక్షణమే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. మద్యం షాపు ఏర్పాటు చేసే పీచు ఫ్యాక్టరీకి ఆనుకుని ఈ మూడు పేటలలో రామాలయం, చర్చి, అంబేడ్కర్ విగ్రహాలు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల కూలి పనులకు వెళ్లి వచ్చిన తమ భర్తలతోపాటు యువకులు మద్యానికి బానిసలవుతారన్నారు. కూలి పనులకు వెళ్లి వచ్చే మహిళలకు అసౌకర్యంగా ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోను నివాస ప్రాంతాల సమీపంలో మద్యం షాపుని నిర్వహించవద్దని నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. మద్యం షాపును తొలగించకపోతే ఆందోళన ఉధృతం చేసేందుకు వెనుకాడమని మహిళలు, స్థానికులు హెచ్చరించారు.

దేవస్థానం భూముల బకాయిలు, శిస్తుల పెంపుపై సమీక్ష



కార్యాలయంలో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం భూముల బకాయిల వసూళ్లు, శిస్తుల పెంపుదలపై గురువారం సదరు కార్యాలయంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సమీక్ష చేశారు. అలాగే దేవస్థానానికి వచ్చే వివిధ మార్గాలను వెడల్పు చేయడంపైన, లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడంపైన వారితో ఎమ్మెల్యే చర్చించారు. వీటితో పాటు అంతర్వేది ఆర్చిగేటు నిర్మాణం, నీలకంఠేశ్వరస్వామివారి ఆలయ పునర్నిర్మాణంపై సమీక్షించారు. అనంతరం దేవస్థానం ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, నాయకులు ముప్పర్తి నాని, ఉండపల్లి అంజి, దిరిశాల బాలాజీ, గుబ్బల ఫణి, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

సఖినేటిపల్లి: మండల పరిధిలోని అప్పనరామునిలంక శివారు కొత్తలంకలో స్థానిక జైభీమ్ ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో 9వ వార్షికోత్సవం పురస్కరించుకుని గ్రామీణ స్థాయిలలో క్రీడాకారులను ప్రోత్సాహానికి ఈ టోర్నమెంట్ ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. కాగా టోర్నమెంట్‌ను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కుమారుడు గొల్లపల్లి శ్రీధర్, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, గెడ్డం తులసీ భాస్కరరావు కలిపి ప్రారంభించారు. పాస్టర్ అశోక్, వైస్ ఎంపీపీ–1 కొల్లాబత్తుల శుభాకర్, నాయకులు గెడ్డం ఫిలిప్‌రాజు, తాడి సహదేవ్, రాపాక మహేష్, నల్లి శివకుమార్, అడబాల జానకీరామ్, రాపాక దిలీప్, చింతా శరత్‌కుమార్, బళ్ల బాబి, చొప్పల బాసు, జైభీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కామేశ్వర శర్మకు ప్రశంసాపత్రం



నిర్వాహకుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న కామేశ్వర శర్మ

అయినవిల్లి: వీరవల్లిపాలెం భద్రకాళి సమేత వీరేశ్వర స్వామివారి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ వెలువలపల్లి కామేశ్వర శర్మకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శైవాగమ పండిత ప్రశంసా పత్రం అందుకున్నారు. గత 21 రోజులుగా జరుగుతున్న ఆన్‌లైన్ క్లాసులలో వేదిక్ యూనివర్సిటీ ద్వారా శైవాగమ, వైఖానస, పంచరాత్ర ఆగమ శాస్త్ర విభాగాల్లో నిర్వహించారు. ఈ క్లాసుల్లో పాల్గొన్న వారికి పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత సాధించిన వారికి తిరుపతిలో వేదిక్ యూనివర్సిటీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ×ఇంటర్నేషనల్ ప్రశంసాపత్రంతో పాటు గుర్తింపు పత్రాలను అందించారు. ఇందులో భాగంగా ఉత్తీర్ణత సాధించిన వెలవలపల్లి కామేశ్వరశర్మకు శైవాగమ శాస్త్ర సారావళి జ్ఞాన పాదం విభాగంలో ప్రశంసాపత్రం, గుర్తింపు పత్రం లభించింది. కామేశ్వరశర్మను తిరుమల తిరుపతి దేవస్థానం శైవాగమన ఆస్థాన పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షిత అవధానులు అభినందించారు.

ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు పదోన్నతి

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గెడ్డం శ్రీనివాస్‌కు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్స్ పదోన్నతుల్లో భాగంగా ఆలమూరులో పని చేస్తున్న శ్రీనివాస్‌ను స్థానిక ఎస్సైగా నియమిస్తూ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనరేట్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

వంతుల వారీ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: ముక్కామల లాకులపై ఉన్న కాలువలకు శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం సాయంత్రం 6 గంటల వరకు 24 గంటల పాటు వంతుల వారీగా సాగు నీరు అందించనున్నట్టు కొత్తపేట అసిస్టెంట్ ఇంజినీర్ తెలిపారు. మొడుకుర్రు, నేదునూరు, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, కె.పెదపూడి, గంగలకుర్రు, మొసలపల్లి, ఎస్.సావరం, బిళ్లకుర్రు, వక్కలంక రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవోదయం 2.0 కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని అన్ని గ్రామాలను సారా రహితంగా తీర్చిదిద్దుతామని అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ అమర్‌బాబు అన్నారు. మండలంలోని చొప్పెల్ల, మడికి, కేశవరం గ్రామాల్లో సీఐ ఐడీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జరిగిన నవోదయం 2.0 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సారా సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా నవోదయం 2.0 పోస్టర్‌ను ఆవిష్కరించారు. సర్పంచ్‌లు యు.లక్ష్మీ మౌనిక, దంగేటి చంద్రకళ, గ్రామ కార్యదర్శి కె.విజయారెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

రావులపాలెం: శ్రీరామనవమి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ముసల రామాలయం ప్రాంగణంలో గురువారం సాయంత్రం బాలికలు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, సభ్యులు చిన్న కేవీ, మల్లిడి కోటేశ్వర రెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో బాలికలు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు



అర్హత పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు, బ్యాంకు మేనేజర్లు

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన బీసీ, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ రుణాల ఇంటర్వ్యూకు 535 మంది దరఖాస్తుదారుల హాజరైనట్టు ఎంపీడీఓ జి.భీమారావు తెలిపారు. మొత్తం 14 గ్రామాలకు సంబంధించి లబ్ధిదారులకు నిర్వహించామన్నారు. మొత్తం 884 మంది దరఖాస్తు చేసుకోగా 535 మంది మాత్రమే హాజరయ్యారు. టైలరింగ్ రుణాల కోసం 250 దరఖాస్తుదారుల హాజరైనట్టు ఆయన తెలిపారు. అయినవిల్లి ఎస్‌బీఐ, ముక్తేశ్వరం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్లు, అలాగే తొత్తరమూడి యూనియన్ బ్యాంకు సిబ్బంది ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, బ్యాంకు మేనేజర్లు అర్హతలను పరిశీలించారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

పి.గన్నవరం: కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు గురువారం ముగిశాయి. మండలంలో కాపు కార్పొరేషన్‌కు 35 రుణ యూనిట్లు, బీసీ కార్పొరేషన్‌కు 72, ఈబీసీ 4, బ్రాహ్మణ, కమ్మ కార్పొరేషన్లకు ఒక్కొక్క యూనిట్ మంజూరయ్యాయి. వీటికి మొత్తం 1,117 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

396 మంది హాజరు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అర్హులైన అభ్యర్థుల నుంచి స్వీకరించిన బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులకు గురువారం ఇంటర్వ్యూ జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 797 దరఖాస్తులు అందాయి. అందులో భాగంగా ఎంపీడీఓ ఏ రాజు ఆధ్వర్యంలో గురువారం 396 మంది హాజరయ్యారు. ఈనెల ఐదు వరకూ మిగిలిన గ్రామాలకు చెందిన అభ్యర్థులకు పరిశీలిస్తామని తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాజోలు: రాజోలు ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రయాణికుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నట్టు డిపో మేనేజర్ పి.ధనమ్మ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రయాణికులు సెల్ 99595 52238కు ఫోన్ చేసి సూచనలు ఇవ్వవచ్చునన్నారు. అలాగే ఈ నెల 5వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు భద్రాచలం సీతారాముల వారి కల్యాణం తిలకించేందుకు వెళ్లడానికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించామన్నారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించామన్నారు. భక్తులు ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్ మహేష్‌కుమార్‌కు సన్మానం



కలెక్టర్ మహేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న పాశర్లపూడి గ్రామస్తులు

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి చింతలమెరక మీదుగా పాశర్లపూడిలంక వరకు పక్కా సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డును రూ.2.15 కోట్ల నిధులతో అభివృద్ధి చేశారు. ఈ రోడ్డు అభివృద్ధికి సహకరించినందుకు పాశర్లపూడి గ్రామస్తులు గురువారం అమలాపురంలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఎంతో కాలం నుంచి బ్లాక్ మెటల్ రోడ్డు పాడైపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు. ఎట్టకేలకు ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, ఉప్పే వెంకట్రావు, ఉప్పే వేణు, ఉప్పే మల్లిఖార్జునరావు, ఉప్పే శ్రీను, దాకే శ్యామ్‌సుందరం, తిరుగుళ్ల వరప్రసాద్, పెచ్చెట్టి లోకేష్, పెదపూడి పవన్ తదితరులు ఉన్నారు.

బాలిక అదృశ్యం

పి.గన్నవరం: బాలిక అదృశ్యమైన సంఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం బాలిక టీవీ చూస్తానని తల్లికి చెప్పి పక్కింటికి వెళ్లింది. ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో పరిసర ప్రాంతాలు గాలించారు. అయినప్పటికీ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హైఓల్టేజీకు దెబ్బతిన్న పీహెచ్‌సీలో పరికరాలు

అయినవిల్లి: సబ్‌స్టేషన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లో హై ఓల్టేజీ విద్యుత్ సరఫరాతో అయినవిల్లి పీహెచ్‌సీలో పరికరాలు, ఫ్రీజ్, ఏసీలు, ఫాన్లు, ట్యూబ్‌లైట్లు మొదలైనవి పాడయ్యాయని పీహెచ్‌సీ వైద్యాధికారి బి.మంగాదేవి తెలిపారు. గురువారం హై విద్యుత్ సరఫరా కావడంతో పరికరాలు దెబ్బతిన్నాయన్నారు. పలు మార్లు ఇలాగే జరిగిందని సిబ్బంది తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా హై విద్యుత్ సరఫరా కావడంతో రూ.లక్షల్లో పరికరాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ విషయమై స్థానిక ఎంపీడీఓకు, విద్యుత్ శాఖ ఏఈకి ఫిర్యాదు చేశామన్నారు. పీహెచ్‌సీ కోసం ఒక ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ చేసి ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, రోగులకు ఇబ్బందులు కాకుండా చూడాలని ఆమె కోరారు.

స్కూల్ ఆటోల తనిఖీ



స్కూల్ ఆటో రికార్డులు తనిఖీ చేస్తున్న రవాణా అధికారులు

కొత్తపేట: స్థానిక పరిసర ప్రాంతాల్లో స్కూల్ పిల్లలను తీసుకు వెళ్లే ఆటో రిక్షాలను గురువారం రవాణాశాఖ అధికారులు తనిఖీ చేసి నాలుగు ఆటోలపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, స్కూల్ విద్యార్థులను తీసుకునివెళ్లే ఆటో రిక్షాలు, వాహనాలు రహదారి భద్రతా నియమాలు, నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని శ్రీనివాసరావు హెచ్చరించారు. రహదారి భద్రత విషయంలో ఉపేక్షించేది లేదని తల్లిదండ్రులు, స్కూల్స్ యాజమాన్యం కూడా బాధ్యత వహించాలని తెలిపారు. త్వరలోనే రహదారి భద్రతపై విద్యార్థులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ సేవలు అభినందనీయం

ఆలమూరు: ఉపాధ్యాయులకు, కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని నర్శిపూడిలోనున్న జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఆనందరావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్న లక్ష్యం మేరకు యూటీఎఫ్ శాఖ సమకూర్చిన రూ.మూడు లక్షలను మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు, మండల యూటీఎఫ్ శాఖ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు, ఈదల సత్తిబాబు, దున్నే స్వామినాయుడు, రాయుడు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.